ప్రజాశక్తి

గురువారం 19 డిసెంబర్ 2024 5 అనంతపురం



మార్కెట్ ధరకే కందుల కొనుగోళ్లు

ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో కందులు పండించిన రైతుల నుంచి ప్రతి రోజూ ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ ధరకు వాటిని కొనుగోలు చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 2024 – 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ సీజన్‌లో కందుల కొనుగోళ్లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కందుల కొనుగోలు సక్రమంగా జరిగిలా కృషి చేయాలన్నారు. గురువారం నుంచి కంది కొనుగోలుకు ఆర్‌ఎస్‌కెలలో రైతుల పేర్ల నమోదు ప్రక్రియ ప్రారంభించాలన్నారు. డిఆర్‌డిఎ పీడీ, డిసిఒ, డిసిఎంఎస్‌కు కేటాయించిన కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఆటంకాలూ లేకుండా కొనుగోలు ప్రక్రియ జరపాలన్నారు. గొనె సంచులు, భద్రపరిచేందుకు గోదాములను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీ మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి, జిల్లా మార్కెటింగ్ అధికారి సత్యనారాయణ చౌదరి, డిఆర్‌డిఎ పీడీ ఈశ్వరయ్య, డిటిసి వీర్రాజు, జిల్లా సహకార శాఖ అధికారి అరుణకుమారి, జిల్లా సరఫరా శాఖ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగలకు పూర్తిస్థాయిలో సాయం అందేలా చూడాలి

షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగల వారికి ప్రభుత్వం నుంచి అందే సహాయ సహకారాలను నిష్పక్షపాతంగా పూర్తిస్థాయిలో అందేలా చూడాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సాంఘిక,గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కాంపోనెంట్ మానిటరింగ్ కమిటీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని సంబంధిత అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పథకంలో 17.08 శాతం ఎస్సీలకు, 5.53 శాతం ఎస్టీలకు వ్యయానికి సంబంధించిన శాతం ఖర్చు చేసేలా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు అందించాల్సిన పథకాల లబ్ధి 100 శాతం అందించాలని, వచ్చే మార్చి 31వ తేదీ నాటికి పూర్తి లక్ష్యాన్ని చేరుకోవాలని తెలియజేశారు.

ఇంటర్ పాలిటెక్నిక్

స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలలో ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ బుధవారం ప్రారంభం అయ్యింది. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఇందులో 17పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 600మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు బయటికి తీసుకువచ్చేందుకు ఇలాంటి పోటీల దోహదపడుతాయన్నారు. ఇంటర్మీడియట్ కళాశాలల తరహాలో పాలిటెక్నిక్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్న విజ్ఞప్తిని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంత పాలిటెక్నిక్ కళాశాలలో బాయ్స్ హాస్టల్‌తో పాటు రోడ్లు ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై అధ్యాపకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాలిటెక్నిక్ కళాశాలలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారం కోసం కషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పోటీలను ప్రారంభించిన అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఎమ్మెల్యే కాసేపు వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



21న ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు

హెచ్‌ఎల్‌సి, బిటిపికి నోటిఫికేషన్ - ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు ఈనెల 21వ తేదీన జరుగనున్నాయి. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఉదయం పది గంటలకు ఈ ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తయ్యాయి. ఆ తరువాత డిస్ట్రిబ్యూటరీల ఎన్నికలు ఈనెల 17వ తేదీన జరిగాయి. డిస్ట్రిబ్యూటరీల కమిటీల అధ్యక్షులు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకోనున్నారు. జిల్లాలో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ (హెచ్‌ఎల్‌సి) ప్రాజెక్టు కమిటీ, భైరవానితిప్ప ప్రాజెక్టు కమిటీ రెండున్నాయి. ఈ ప్రాజెక్టులకు సంబంధించి కమిటీలను ఈనెల 21వ తేదీన జరుగనున్నాయి. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ప్రాజెక్టు కమిటీ కింద ఆరు డిస్ట్రిబ్యూటరీలున్నాయి. కర్నూలు జిల్లాలో ఒకటి, కడప జిల్లా పరిధిలో ఆరు డిస్ట్రిబ్యూటరీలున్నాయి. మొత్తం ఈ ప్రాజెక్టు పరిధిలో 12 డిస్ట్రిబ్యూటరీ కమిటీలున్నాయి. వీటికి ఈనెల 17వ తేదీన ఎన్నికలు పూర్తయ్యాయి. అదే విధంగా భైరవానితిప్ప ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు ఇదే తరహాలో జరగనుంది. దీనికి సంబంధించి ఈనెల 21వ తేదీన ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ మేరకు కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు.

ఎన్నికల ప్రక్రియ ఇలా

21వ తేదీ ఉదయం పది గంటలకు జనరల్‌బాడీ సమావేశం ఉంటుంది. ఉదయం 10 గంటలకు నామినేషన్ల స్వీకరణ జరగనుంది. 10.15 గంటలకు ఇది పూర్తవుతుంది. ఉదయం 10.30 గంటలకు నామినేషన్ల తుదిజాబితా వెలువడుతుంది. 10.30గంటల నుంచి 11 గంటల వరకు ఓట్ల లెక్కింపు ఫలితాల వెల్లడి ఉంటుంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.15 గంటల వరకు వైస్ ఛైర్మన్ ఎన్నిక, మరియు నామినేషన్ల ప్రకటన ఉంటుంది. మధ్యాహ్నం 12.15 గంటల నుంచి 12.30 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 12.30 గంటల నుంచి ఒంటి గంట మధ్య ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది. మధ్యాహ్నం 1 గంట నుంచి 1.15 గంటల మధ్య ఓట్ల ఫలితాలు వెలువడుతాయి.

ఈసారైనా మారేనా ?

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ప్రాజెక్టు కమిటీ పరిధిలో ఎప్పుడూ కడప జిల్లాకు చెందిన వారే కమిటీ అధ్యక్షులుగా ఎన్నికవుతూ వస్తున్నారు. ఈసారి అయినా మారుతుందా లేదా అన్నది సందేహముంది. జిల్లాలో 12 మంది సభ్యులుంటే ఐదుగురు అనంతపురం, ఆరుగురు కడప జిల్లా నుంచి, ఒకరు కర్నూలు జిల్లా నుంచి ఉంటారు. సంఖ్యాబలం ఎక్కువగా ఉన్నందున ఎప్పుడూ కడప జిల్లాకు చెందిన వారే ఉంటూ వస్తున్నారు. కర్నూలు జిల్లాకు సంబంధించిన వారు ఎటువైపు మొగ్గచూపుతే అటు ఫలితం వచ్చే అవకాశముంది.

మూడు రోజులు

జిల్లాకు వర్ష సూచన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాకు రాబోయే మూడు రోజులు వర్ష సూచన ఉన్నట్టు వాతావరణ శాఖ తెలియజేసింది. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి అధికారులు ప్రకటన విడుదల చేశారు. వర్షం సూచన నేపథ్యంలో రైతులు సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షం తగ్గిన తర్వాతనే పంట కోతలు మొదలు పెట్టాలన్నారు. పంట కోత చేసి పొలాల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలకు తరలించుకోవాలని సూచించారు. ఆర బోసిన పంట వర్షానికి తడవకుండా కాపాడుకునేందుకు వరి కొనుగోలు కేంద్రాలలో కనేకల్‌లో 30, శ్రీధర్ గట్టలో 30, ఉద్దేహాళ్‌లో 30, కల్లూరు వరి కొనుగోలు కేంద్రాల్లో 10 టార్పాలిన్లను అందుబాటులో ఉంచినట్లు తెలియజేశారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం

- ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్
- ముగిసిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు
- నూతన కార్యవర్గం ఎన్నిక



ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ నాయకులు



మాట్లాడుతున్న ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-గుత్తి

ప్రభుత్వాల మొద్దునిద్రను వదలించి ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బుల విడుదల, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం అని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ పిలుపునిచ్చారు. గుత్తి పట్టణ శివారులోని మాసినేని ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఎస్ఎఫ్ఐ 32వ జిల్లా మహాసభలు బుధవారం ముగిశాయి. రెండవ రోజు సభలకు ఎస్ఎఫ్ఐ మాజీ కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ హాజరై మాట్లాడారు. డిగ్రీ, ఇంజినీరింగ్ పీజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులు విడుదల చేయాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2100కోట్లు, వసతి దీవెన, రూ.1480 కోట్లు విడుదల చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబర్ 77ను రద్దు చేయాలన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేకుంటే రాబోవు రోజుల్లో విద్యార్థులు ఉద్యమాల బాట పట్టాల్సిన పరిస్థితి వస్తుందన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక ప్రధాన కార్యదర్శిగా ఓతూరు పరమేష్, అధ్యక్షులుగా సిద్ధు

మహాసభల సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు 25 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఓతూరు పరమేష్, అధ్యక్షుడిగా సిద్దు, ఆఫీస్ బ్యారెట్స్‌గా సి.రమేష్, వంశీ, గిరి, శివ, రజిత, శివ, భీమేష్, వెంకీ, సూర్య, జిల్లా కమిటీ సభ్యులుగా ధను, బాలాజీ, సోము, వీరేష్, మహేష్, జాకీర్, గౌతమ్‌లను ఎన్నుకున్నారు.

మెడికల్ కాలేజీ అధ్యాపక పోస్టులను భర్తీ చేయండి: సిపిఎం



మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం మెడికల్ కాలేజీలో అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సిపిఎం నాయకులు కోరుతున్నారు. ఈ మేరకు సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావును కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ రోగుల సౌకర్యార్థం సర్వజన ఆసుపత్రికి అనుబంధంగా వైద్య కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. 100 ఎంబిబిఎస్ సీట్లతో కళాశాలను ప్రారంభించారన్నారని తెలిపారు. వీటికి అనుబంధంగా ఇతర సిబ్బందిని కూడా నియమించారన్నారు. కాలక్రమేనా 100 సీట్ల నుంచి ప్రస్తుతం 200 ఎంబిబిఎస్ సీట్లకు స్థాయిని పెంచారన్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగినా ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్లను పెంచలేదన్నారు. ట్యూటర్లను కూడా కొత్తవారిని నియమించలేదన్నారు. 2004 తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలను సెమీ అటానమస్ చేయాలని ప్రయత్నం చేసినప్పుడు అనంతపురం జిల్లాలోని ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, డాక్టర్లు, విద్యార్థులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పోరాటం చేసి దానిని తిప్పికొట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి 560 పడకలు కేటాయింపు, 1200కు పైగా ఐపి, 2500కు పైగా ఓపి సేవలు అందుతున్నాయని చెప్పారు. 560 మందికి సరిపడా వైద్య సిబ్బంది లేక రోగులకు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. దీనిపై స్పందించి 1200 పడకలకు పెంచి అందుకు తగినంత మంది వైద్యులు, సిబ్బందిని కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పునర్విభజన పేరుతో అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి 30 ట్యూటర్ పోస్టులను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండడం సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకుని ఇతర ప్రాంతాలకు తరలించిన 33 ట్యూటర్ పోస్టులను వెనక్కి తెప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య కళాశాలలో 200 ఎంబిబిఎస్ సీట్లుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌వి.నాయుడు, ప్రకాష్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

నిరుపేదలకు మూడెకరాల భూమి ఇవ్వాలి

రెవెన్యూ సదస్సులో సిపిఎం వినతి



రెవెన్యూ సదస్సులో వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

భూమిలేని నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి మూడెకరాల భూమి ఇవ్వాలని సిపిఎం నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం మండల పరిధిలోని తరిమెల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య, ఎంపిడిఒ నిర్మలాకుమారికి సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ మండలంలోని భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలకు మూడెకరాల భూమి ఇవ్వాలని, గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించాలని, ఇల్లు లేని వారందరికీ ఇల్లు ఇవ్వాలని, స్థలాలు ఇవ్వాలని, శ్మశానాల్లో కంపచెట్లను తొలగించలని డిమాండ్ చేశారు. అలాగే శింగనమల ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటలపాటు డాక్టర్లు, మందులను అందుబాటులో ఉండేవిధంగా చూడాలని చూడాలని, తరిమెల హాస్టల్‌కు నూతన భవనాలను నిర్మించాలని కోరారు. కల్లమడి గ్రామం మెయిన్ రోడ్డులో పడిన గుంతలను పూడ్చాలని, ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీనివాసులు, ఆంజనేయులు, రామాంజనేయులు, గంపమల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకూ నీరందించాలి

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



హెచ్చెల్సీ కెనాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల/పుట్లూరు

హెచ్చెల్సీ చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నార్పల మండలంలోని కురుగానిపల్లి వద్ద ఉన్న 84వ కిలోమీటర్ నుంచి పుట్లూరు మండలంలోని 96వ కిలోమీటర్ వరకూ దాదాపు 10 కిలోమీటర్ల పొడవున స్వయానా ఎమ్మెల్యే నడుస్తూ నీటి పారుదలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్లూరు మండలంలోని చింతకుంట గ్రామంలో కెనాల్‌కు గండి పడితే 48 గంటల్లోనే మరమ్మతులు చేయడంతోపాటు గేట్లు కూడా అమర్చి నీటిని విడుదల చేశామన్నారు. అయితే 230 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తే 105 క్యూసెక్కుల నీరు మాత్రమే చెరువులకు చేరుతోందన్నారు. నీటి విడుదల చేసిన చోటు నుంచి చెరువులకు నీరు చేరే వరకూ కాలువలో ఉన్న పిచ్చిమొక్కలు, వ్యర్థాలు, బండరాళ్ల ఉండటంతో నీటి ప్రవాహ వేగం తగ్గడాన్ని గమనించినట్లు వివరించారు. గత వైసిపి ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. అంతేకాకుండా లీకేజీలకు మరమ్మతులు చేయకుండా నీటి వృథాను అరికట్టలేమన్నారు. సాగునీరు, రైతుల విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ఎక్కడా లీకేజీలు లేకుండా, ఎప్పటికప్పుడు లష్కరులు, జెఇలు నిఘా ఉంచాలన్నారు. ఎక్కడికక్కడ నీటి డిస్ట్రిబ్యూటరీల పరిధిలోని లీకేజీలు తెలుసుకుని మరమ్మత్తులు చేస్తే, చివరి ఆయకట్టు వరకూ నీరు చేరుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల విజయ్‌కుమార్ (బాబు),, జిసి.బాబు, సౌత్ కెనాల్ ఛైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు, వైస్‌ఛైర్మన్ చంద్రాయుడు, గూగూడు ఓబులేసు, మోహన్, చంద్రబాబు, కడవకల్లు నీటి సంఘాల నాయకులు శ్రీనివాస్‌నాయుడు, నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, ఎల్కే చెన్నారెడ్డి, వీరయ్య, వెంకటరాముడు, లక్ష్మీనారాయణరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అదాని పరిశ్రమలో

ప్రమాదం


ఆరుగురు కార్మికులకు గాయాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, తాడిపత్రి

అనంతపురం జిల్లాలోని ఆదానికి సంబంధించిన అంబుజా సిమెంటు పరిశ్రమలో బుధవారం సాయంత్రం ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆరుగురు కార్మికులు గాయపడ్డారు. ఇందులో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. అనంతపురం జిల్లాలోని యాడికి మండలం బోయరెడ్డిపల్లి వద్ద సిమెంటు పరిశ్రమ ఉంది. మొదట ఇది పెన్నా సిమెంటుగా ఉండింది. ఇటీవలే ఆదానీకి సంబంధించి అంబుజా సిమెంటు దీన్ని టేక్‌ఓవర్ చేసింది. ఈ పరిశ్రమలో మెయిటెన్స్ నిమిత్తం గత కొంతకాలంగా ఉత్పత్తిని నిలుపుదల చేశారు. బుధవారం నాడు పరిశ్రమలో తిరిగి ఉత్పత్తి ప్రారంభించే క్రమంలో పనులు చేపడుతుండగా కోల్ ప్లాంట్‌లో పైనుంచి మండుతున్న ఇనుపరేకు కిందకు పడినట్టు సమాచారం. వేడిగానున్న ఈ రేకు మీదపడటంతో ఆరుగురు కార్మికులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే తాడిపత్రి పట్టణంలో లార్డ్స్ ఆసుపత్రికి తరలించారు. ఇందులో ఇద్దరి పరిస్థితి తీవ్రంగా ఉండటంతో అనంతపురానికి మెరుగైన చికిత్స కోసం తరలించారు. ప్రమాద విషయం తెలియడంతో స్థానికులు పరిశ్రమ వద్దకు పెద్దఎత్తున చేరుకున్నారు.

మహిళల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్



మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

మహిళలు అన్నివిధాలా అభివృద్ధి చెందాలన్న సంకల్పంతో సిఎం చంద్రబాబు అనేక ప్రోత్సాహకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. బుధవారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు మంజూరైన స్త్రీనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహించి కుటుంబానికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్లు పించన్లు పెంచడంతోపాటు మహిళలకు ఉచిత మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నారన్నారు. వీటికితోడు ఆర్థిక పరిపూర్ణత సాధించడానికి శ్రీనిధి పేరుతో ఒక్కో సంఘానికి రూ.5లక్షల వరకూ రుణాలు ఇస్తున్నారన్నారు. వీటితో మహిళలు ఆదాయ మార్గాలను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, ఎంపిపి వాల్మీకి మాధవి, డిఎల్‌డిఒ విజయలక్ష్మి, ఎంపిడిఒ శ్రీకాంత్‌చౌదరి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు వెంకటేష్, మాజీ కౌన్సిలర్లు అంజి, ఆమ్లెట్ మస్తాన్‌యాదవ్, ఎటిఎం గుణభూషణ శ్యామ్, కార్యాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

అప్పులు బాధ లేక ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పెద్దముష్టూరు వెంకటేశులు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా హుసేనాపురం గ్రామానికి చెందిన కౌలు రైతు బోయ రాముడు రైతుల దగ్గర భూమి కౌలుకు తీసుకుని పంట పొలాలు సాగు చేసుకునేవాడన్నారు. ఇందులో భాగంగానే వ్యవసాయ పనుల కోసం రూ.8లక్షల అప్పులు చేశాడన్నారు. సాగు చేసిన పంటలు చేతికి రాక చేసిన అప్పులు ఎలా తీర్చుకోవాలో తెలియక తీవ్ర ఆందోళనకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. కావున ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

'సెకి' ఒప్పందాన్ని రద్దు చేయాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-యల్లనూరు

అదానీ గ్రూపునకు చెందిన సెకి ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో సిపిఎం రూపొందించిన 'సమో అదానీ.. కరెంట్ షాకీ.. జగన్ మీలాకత్.. బాబు ఖుషి మత్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో 'సెకి' సౌరవిద్యుత్ ఒప్పందం కుదుర్చుకోవడానికి అదానీ కంపెనీలు రూ.1,750 కోట్లు లంచం ఇచ్చాయన్న కుంభకోణం అమెరికాలో బయటపడిందన్నారు. ఇంత పెద్ద కుంభకోణం బయటపడినా మన నాయకులు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. దీని ఫలితంగా ప్రజలు భారాలు మోయాల్సి వస్తోందన్నారు. 'సెకి' ఒప్పందాన్ని రద్దు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గాలి రమేష్, సభ్యులు ఓబులేసు, సూరి, ప్రజలు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

హోరాహోరీగా అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్కే డిగ్రీ కళాశాల, ఎస్కెయు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్కెయు పరిధిలోని అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. ఇందులో భాగంగా ఆర్ట్స్ క్రీడా మైదానంలో బుధవారం మొదటి మ్యాచ్ ఎస్వీ డిగ్రీ కళాశాల, ఎస్ఎస్‌బిఎన్ మధ్య సాగింది. ముందుగా ఎస్కెయు రిజిస్ట్రార్ ఇ.రమేష్‌బాబు, ఎస్కెయు స్పోర్ట్స్ సెక్రటరీ, కన్వీనర్ బి.జెస్సీ, ఎస్వి కళాశాల ఛైర్మన్ సి.వజ్రభాస్కర్‌రెడ్డి, తదితరులు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం జరిగిన మ్యాచ్‌లో ఎస్వీ డిగ్రీ కళాశాల 195/6 (20ఓవర్లు) చేయగా ఎస్ఎస్‌బిఎన్ 178కు ఆలౌవుట్ అయింది. 2వ మ్యాచ్‌లో వివేకానంద కళాశాల 108/5 చేయగా అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల 107/5 చేసి ఓటమి పాలైంది. మూడవ మ్యాచ్‌లో ఎస్ఎస్‌బిఎన్ 195/9 చేయగా శ్రీవాణి డిగ్రీ కళాశాల 168 పరుగులు చేసి ఓటమి పాలైంది. 4వ మ్యాచ్‌లో కదిరి బ్లూమూన్ డిగ్రీ కళాశాల 146 పరుగులతో విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ ఛైర్మన్ ఎస్.వి.ప్రసాద్, సెక్రటరీ ఎం.శ్రీనివాసులునాయక్, వివిధ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు శ్రీరామ్, ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగుతున్న క్రికెట్ మ్యాచ్



నేడు, రేపు ఎర్రబ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్ మంజూరులో ఆర్టీసీ పెన్షనర్లకు అధికారులు పెడుతున్న ఇబ్బందులకు నిరసనగా గురు, శుక్రవారాల్లో ఆర్టీసీ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయనున్నట్లు ఏపి పిటిడి నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాయదుర్గం డిపో కార్యదర్శి హెచ్.టి.స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ప్రావిడెంట్ ఫండ్ ట్రస్ట్ కార్యాలయంలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లకు పిఎఫ్ మంజూరులో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపించారు. ఈనేపథ్యంలో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురు, శుక్రవారాల్లో ఆర్టీసీ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ఆర్టీసీ డిపో వద్ద గేట్ మీటింగ్, ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్టీసీ ఉద్యోగులు, నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కేంద్రమంత్రిని కలిసిన ఎంపి అంబికా

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడును అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ బుధవారం ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు.



రామ్మోహన్‌నాయుడును సన్మానిస్తున్న ఎంపి అంబికా

21న జాబ్‌మేళా

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 21న ఎపిఎస్ఎస్‌డిసి ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ గంగావతి, కళాశాల ప్రిన్సిపాల్ డేవిడ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో విశ్వదర్శన అకాడమీ, ఎయిర్ టెల్ వంటి కంపెనీలు పాల్గొని తమకు కావాల్సిన అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ నుంచి పిజీ వరకూ చదువుకున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్.. 90100 39901 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

క్యాంటీన్ విస్తరణ పనులకు భూమిపూజ


ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లా పోలీస్ సంక్షేమంలో భాగంగా అనంతపురం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న సిపిసి (సెంట్రల్ పోలీస్ క్యాంటీన్) క్యాంటీన్ విస్తరణ నిర్మాణ పనులకు అదనపు ఎస్పీలు డి.వి.రమణమూర్తి, ఇలియాజ్ బాషా (ఎఆర్) బుధవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రాముడు, మధు, ఆర్ఎస్ఐ మగ్బూల్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యకుమార్, జిల్లా కమిటీ సభ్యులు గాండ్ల హరినాథ్, తేజపాల్, ఆనంద్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



క్యాంటీన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

ఆయకట్టు ఛైర్మన్‌కు సన్మానం



సత్యనారాయణకు బొకే అందజేస్తున్న వెంకటనారాయణ


శింగనమల : శింగనమల రంగరాయ చెరువు ఛైర్మన్‌గా ఎన్నికైన జి.సత్యనారాయణను బుధవారం మండల కేంద్రంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు బండి వెంకటనారాయణ ఘనంగా సత్కరించారు. బొకే అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ శింగనమల చెరువు ఆయకట్టు కింద బీడు భూములను పచ్చని పొలాలుగా మార్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

రైతులు మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ ఆయా సాగునీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులకు సూచించారు. బుధవారం స్థానిక పరిటాల రవి కళ్యాణ మండపంలో నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష, సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగునీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులకు సాగునీటిలో రైతుల మధ్య సమన్వయం ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. రైతుల మధ్య గొడవలు జరగకుండా సాగునీటి పంపిణీ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అంతేకాకుండా ఆయకట్టు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరులు నారాయణస్వామి, నారాయణ, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ వెంకటేష్, టిడిపి పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, మాజీ కౌన్సిలర్లు అంజి, ఆమ్లెట్ మస్తాన్‌యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



పామిడి తాగునీటి సంఘం అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

పామిడి : సాగునీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులతోపాటు టిసి సభ్యులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అభినందించారు. బుధవారం గుంతకల్లులోని పరిటాల రవి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాగునీటి సంఘం సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతన్నల సమస్యల కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. కాగా పామిడి సాగునీటి సంఘం ఛైర్మన్ వెంకటేష్, వైస్‌ఛైర్మన్ మారుతీప్రసాద్‌రెడ్డి, ఎద్దులపల్లి ఛైర్మన్ పాళ్యం నరసింహులు, వైస్‌ఛైర్మన్ గోవిందరాజులు, అనుంపల్లి ఛైర్మన్ లక్ష్మన్న, వైస్‌ఛైర్మన్ కంచం సుంకయ్య, పాళ్యం ఛైర్మన్ లక్ష్మన్న, వైస్‌ఛైర్మన్ నారాయణస్వామి, రామగిరి ఛైర్మన్ సుదర్శన్, వైస్‌ఛైర్మన్ కేశవనాయక్‌తోపాటు మండలంలోని 42 మంది టీసీ సభ్యులందరూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి, నారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పాస్టర్‌రెడ్డి నెహెమ్యా నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక 'అసోసియేషన్ ప్రీ క్రిస్మస్' యేసుకృప మందిరం మైదానంలో ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ జి నవీన్‌కుమార్ పాస్టర్ లీనా డేబోరా ఆరాధన చేయగా దైవ సేవకులు పాటలు పాడారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కేక్ కోసం క్రైస్తవులను శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత అతిథులను శాలువాలు కప్పి మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎవెంజెలిస్ట్ పాస్టర్ గాడ్లి, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ పీ మార్కు, జాయింట్ సెక్రెటరీ పాస్టర్ వి మనషే, సెక్రటరీ పాస్టర్ జిఆర్ ఆనంద్, ట్రెజరర్ పాస్టర్ కె.జీవన్‌బాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ రూఫస్ కుమార్, శాంత వర్ధన్, జహంగీర్ జాషువా, లాబాన్, తదితరులు పాల్గొన్నారు.



పాస్టర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ఉరవకొండ : మానవులను చెడును విడిచిపెట్టి మంచి మార్గంలో నడిపించడమే క్రిస్మస్ ఉద్దేశమని ఎపిపిటి డిఇపిఎఫ్ అధ్యక్షులు శ్యాంకుమార్ అన్నారు. ఉరవకొండ డిపో ఎపిటిడి ఇపిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శాలెం క్రిస్టియన్ అసెంబ్లీ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిపిటిడి ఇపిఎఫ్ కార్యదర్శి అంకరాజు, కమిటీ సభ్యులు రెవరెండ్ బాబ్జి, రెవరెండ్ రమేష్, పాల్ కుమార్, నాగరాజు, లిడియమ్మ, సునీల్, ఎమ్మెస్ రాజు, కృపాకర్, సుబ్రమణ్యం ఎఎంఎఫ్ డిపో ఎల్‌హెచ్ దేవప్ప, సూపర్‌వైజర్ ఇడి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపును అలవాటు చేసుకోవాలి

విద్యుత్ శాఖ ఎఇ షఫీవుద్దీన్

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఇంధన పొదుపును అలవాటుగా చేసుకోవాలని విద్యుత్ వాఖ ఎఇ షఫీవుద్దీన్ సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వం పాఠశాలలో ఇంధన పొదుపుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపుగా వాడుకుంటే భవిష్యత్ తరాలకు మేలు చేసినవారం అవుతామన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. తద్వారా విద్యుత్తు పొదుపు కావడమే కాకుండా అవసరాలకు సరిపడా ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా సంప్రదాయ బల్బుల స్థానంలో ఎల్ఇడి బల్బులను వాడితే 60 శాతానికిపైగా విద్యుత్ ఆదా చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎవి.సుధాకర్‌బాబు, ఉపాధ్యాయులు దేవకుమార్, సుంకన్న, సిబ్బంది శంకర, హరి, గోపాల్, గిరికుమార్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ ఎఇ షఫీవుద్దీన్

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని చెర్లోపల్లి, చాలవేముల గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి కాత్యాయిని మాట్లాడుతూ రైతులు రబీలో సాగు చేసిన పప్పుశనగ, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ తదితర పంటలకు రైతులు తప్పనిసరిగా బీమా ప్రీమియాన్ని చెల్లించుకోవాలన్నారు. ఇకపోతే పప్పుశనగలో వచ్చే శనగపచ్చ పురుగు నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములు లేదా క్లొరాంట్రనిలిప్రోల్ 60 మిలి ఏదో ఒకటి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ హరి, విహెచ్ఎ రవితేజ, ఎంపిఇఒ సుధ, విఆర్ఎ గోపాల్, దివాకర్, రైతులు పాల్గొన్నారు.



పుట్లూరు మండలంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



విడపనకల్ మండలంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని పెద్ద కొట్టాలపల్లి, విడపనకల్ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యవసాయ అధికారులు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఎడిఎ పద్మజ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు సాగు చేసిన పంటలపై మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కంది, పప్పుశనగ, జొన్న పంటలపై రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఒ పెన్నయ్య, విఎఎ శివలత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో తెగుళ్ల నివారణ

ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్

ప్రజాశక్తి-గార్లదిన్నె

పండ్ల తోటల రైతులు యాజమాన్య పద్ధతులు, మెళకువలు పాటిస్తే తెగుళ్లు, పురుగులను నివారించుకోవచ్చునని ఉద్యానవన శాఖ అధికారి రత్నకుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఉద్యానవన శాఖ కార్యాలయంలో పంట యాజమాన్య పద్ధతులపై పండ్ల తోటల రైతులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా చీనీ, మామిడి తోటల్లో వచ్చే తెగుళ్లు, నివారణకు చేపట్టాల్సిన చర్యలు, పురుగుల నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త సుబ్రమణ్యం, మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, విహెచ్ఎలు, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్

శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రాధాన్యత

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో అన్ని మతాల శ్మశాన వాటికల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. బుధవారం నగరంలోని 50వ డివిజన్ హెచ్ఎల్ సి కెనాల్ సమీపంలో ఉన్న ముస్లిం శ్మశాన వాటికను డిప్యూటీ మేయర్ విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ నగరంలో అన్ని మతాల శ్మశాన వాటికల అభివృద్ధికి తమ పాలకవర్గం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగానే అశోక్‌నగర్‌లోని ముస్లిం శ్మశానవాటికకు రూ.67లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణం, రూ.17 లక్షలతో లైట్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రూ.50లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులతో నవోదయ కాలనీ హిందూ శ్మశానవాటికలో అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామనిన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మునిశేఖర్, సైఫుల్లాబేగ్, కమల్‌భూషణ్, అభూసాలేహా, సిపిఎం వలి, ఇఇ రాధాకృష్ణ, ఎఇ ఉమామహేశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

హోంగార్డుల వేతనాల ప్యాకేజీపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లాలోని హోంగార్డుల వేతనాల ప్యాకేజీపై బుధవారం నగరంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాలులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 6వతేదీన ఎస్పీ పి.జగదీష్ నిర్వహించిన హోంగార్డుల దర్బార్‌లో తమ వేతనాల బ్యాంకు ఖాతాల మార్పునకు సంబంధించి పలువురు హోంగార్డులు వినతిపత్రాలు అందజేశారు. ఆయా వినతులపై ఎస్పీ సానుకూలంగా స్పందించారు. ఇందులో భాగంగా హోంగార్డుల వేతనాల ఖాతాను యాక్సిస్ బ్యాంకు నుంచి ఎస్‌బిఐకు మార్చాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా స్థానిక శాఖ వారితో సమావేశం ఏర్పాటు చేసి బ్యాంకు నుంచి ఎలాంటి ప్రయోజనాలు పొందవచ్చో క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, ఎఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఆర్ఐలు మధు, రాముడు, ఎస్పీ సిసి ఆంజనేయప్రసాద్, ఎస్‌బిఐ అధికారులు వేణుగోపాల్, రాఫెల్ రాజు, నవీన్ మురహరి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా

21 నుంచి గ్రామసభలు

నార్పల : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023-24లో చేసిన పనులకు సామాజిక తనిఖీ బృందం ఈనెల 21వతేదీ నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ గంగావతి, ఎంపిఒలు ఎర్రమ్మ, రమేష్, రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్యే సురేంద్రబాబును కలిసిన పరిటాల సునీత

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును బుధవారం కళ్యాణదుర్గంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన పరిటాల సునీత, అమిలినేని ఇంటికి రాగా సాదరంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ వైపి.రమేష్, టిడిపి సీనియర్ నాయకులు రామ్మోహన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పరిటాల సునీతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

బీరప్ప స్వాముల పట్టాభిషేకం

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని తురకపల్లి గ్రామంలో గుత్తి, పెద్దవడురప్ప, చిన్న వడుగురప్ప బీరప్ప స్వాముల మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వైసిపి గుత్తి పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా, మాజీ ఎంపీటీసీ పుట్లూరు శ్రీరాములు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఈ మహోత్సవం జరగడంతో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం బీరప్ప స్వాముల వారిని భక్తులు ఊరేగించారు.

జెఎన్‌టియులో కొనసాగిన శిక్షణ



శిక్షణ ఇస్తున్న అధికారి

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఎఐసిటి ఇ-అటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ బుధవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా 'సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్' అనే అంశంపై ఎస్‌కెయు ఆచార్య కె.నాగభూషణరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ టి.బాలనరసయ్య, కో కోఆర్డినేటర్ దిలీప్‌కుమార్, విభాగ అధిపతి ఎం.కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే తనిఖీ

ప్రజాశక్తి-యాడికి

మండల కేంద్రంలోని సచివాయలం-3తోపాటు మండల పరిధిలోని వీరన్నపల్లిలో చేపట్టిన ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వేను తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు శుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత, ఫ్రైడే డ్రైడే పాటించాలని సూచించారు. ఇందులో భాగంగా ప్రతి శుక్రవారం తమ ఇళ్లలోని నీటికుండలను కడిగి ఆరబెట్టిన తర్వాత వాడుకోవాలన్నారు. తర్వాత యూనివర్సల్ ఇమినైజేషన్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు ప్రమీల, మరియమ్మ, ఆశా కార్యకర్తలు నాగజ్యోతి, నాగసులోచన, లక్ష్మీ, లీలావతి, సారమ్మ, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వానికి విరాళం

అనంతపురం రూరల్ : సభ్యత్వాల నమోదు కోసం నగరంలోని 5వ డివిజన్‌కు చెందిన టిడిపి నాయకుడు జయప్రకాష్ నారాయణ బుధవారం రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈమేరకు సంబంధిత మొత్తాన్ని అర్బన్ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జయప్రకాష్‌ను ఎమ్మెల్యే అభినందించారు.



విరాళం అందజేస్తున్న టిడిపి నేత జయప్రకాష్‌నారాయణ

నేటి నుంచి రైల్వేగేటు మూసివేత

గార్లదిన్నె : మండల కేంద్రంలోని రైల్వేగేటును గురువారం నుంచి నాలుగు రోజుల పాటు మూసి వేయనున్నట్లు రైల్వే ఇంజినీరింగ్ విభాగం అధికారి జీ.రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గార్లదిన్నె, తాటిచెర్ల-కల్లూరు సెక్షన్ పరిధిలో ట్రాక్ పనులు జరుగుతున్న దృష్ట్యా రైల్వే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కావున కోటంక, మర్తాడు, పెనకచెర్ల, పెనకచర్ల డ్యాం వెళ్లే వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

సిమెంట్ గోడౌన్ తనిఖీ

యాడికి : మండల కేంద్రంలోని సిమెంట్ గోడౌన్‌ను గుంతకల్ డివిజన్ హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ మధుసూదన్‌రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదేవిధంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద సొంత స్థలంలో నిర్మించిన ఇళ్లు, చందన రోడ్ లేఔట్‌లో నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. ఈకార్యక్రమాల్లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాషావలి, అసిస్టెంట్ ఇంజినీర్ లోకేష్‌కుమార్, వర్క్ ఇన్స్‌పెక్టర్ మధు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు వేగవంతం

ఉరవకొండ : ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని లత్తవరం తండాలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.4లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఈమేరకు రోడ్డు పనులను టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో లత్తవరం మాజీ సర్పంచి బోధపాటి గోవిందప్ప, వి.మోహన్, లత్తవరం తండా ఉప సర్పంచి సుంకమ్మ, నారాయణస్వామినాయక్, శంకర్‌నాయక్, స్టోర్ డీలర్ వెంకటేష్‌నాయక్, రాజునాయక్, రామోజీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌పిఎఫ్ రాయలసీమ జోనల్ కార్యదర్శిగా ఈశ్వరప్ప

ప్రజాశక్తి-రాయదుర్గం



జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ (ఎన్‌హెచ్‌ఆర్‌పిఎఫ్) రాయలసీమ జోనల్ సెక్రటరీగా పట్టణానికి చెందిన కావలి ఈశ్వరప్ప నియమితులయ్యారు. ఈమేరకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు టిఎస్ రామచంద్రనాయుడు నియామక లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరప్ప మాట్లాడుతూ తాను గతంలో సంస్థ జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. సంస్థ నిర్వాహకులు, సభ్యులు ఇచ్చిన ప్రోత్సాహం, తనపై నమ్మకంతో రాయలసీమ జోనల్ కార్యదర్శిగా ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. ఇందుకు సహకరించిన సంస్థ వ్యవస్థాపకులు టి.రామచంద్రనాయుడు, రాష్ట్ర అధ్యక్షులు బిఎస్ కృష్ణారెడ్డికి కతజ్ఞతలు తెలిపారు.

'బాలాజీ' ఫార్మసీలో జాబ్‌మేళా



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

అనంతపురం : అనంతపురంలోని బాలాజీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా హెటిరో ఫార్మాస్యూటికల్స్ నిర్వహించిన జాబ్‌మేళాలో 30 మంది విద్యార్థులు పాల్గొనగా 16 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె వెంకట్ కృష్ణకిషోర్, ప్రిన్సిపాల్ వి.శ్రీధర్, మేనేజ్‌మెంట్ ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఇన్‌ఛార్జి వెంకటేశ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కాపర్ వైర్ చోరీ



పగులగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్

కళ్యాణదుర్గం రూరల్ : మండల పరిధిలోని బోరంపల్లి గ్రామానికి చెందిన రైతు పాతురప్ప వ్యవసాయ తోటలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫర్మర్ పగులకొట్టిన కాఫర్ వైరును చోరీ చేశారు. రెండు రోజుల క్రితం ఇదే గ్రామంలో పాలిటెక్నికల్ కళాశాల, ముదిగల్లులో ఇదేవిధంగా చోరీలకు పాల్పడ్డారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రైతుల పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లను పగులగొట్టే దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

భార్యను వేధించిన కేసులో భర్తకు జైలు

అనంతపురం క్రైం : అదనపు కట్నం కోసం భార్యను వేధించిన కేసులో భర్తకు సంవత్సరం జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ మొబైల్ జడ్జి తీర్పు చెప్పారు. త్రీ టౌన్ సీఐ కె.శాంతిలాల్ తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని ఎర్రనేల కొట్టాలకు చెందిన బత్తల సురేంద్రబాబుకు అదేకాలనీకి చెందిన బత్తల శైలజకు 2009లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.లక్ష నగదు, 8 తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. అనంతరం తనకు రూ.1.5 లక్షలు అదనపు కట్నం కావాలంటూ శైలజను శారీరకంగా వేధించాడు. దీంతో శైలజ స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ నాగమధు కేసు నమోదు చేసి నిందితుడు బత్తల సురేంద్రబాబును రిమాండ్‌కు పంపారు. సాక్షులను విచారించిన మొబైల్ జడ్జి జె.సుజన్ నిందితుడికి సంవత్సరం జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో సాక్షులను కోర్టు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణరెడ్డి కోర్టులో హాజరు పరచగా ఎపిపి వి.శ్రీనివాసులు ప్రాసిక్యూషన్ తరపున వాదించారు.